

ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్


పూజా సామగ్రిని బైకుపై తీసుకెళ్తున్న మహిళలు


మూసాపేటలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మహేందర్


మూసాపేటలో మట్టి వినాయకులతో విద్యార్థులు

తొలి పూజకు వేళాయే

- కూకట్‌పల్లిలో వినాయక చవితి శోభ
- ఆకట్టుకుంటున్న మండపాలు
- పండుగ కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట
- పలు ప్రాంతాల్లో మట్టి గణపతుల పంపిణీ

కూకట్‌పల్లి జోన్ బృందం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణనాథుని ఆగమనానికి సర్వం సిద్ధమైంది. వినాయకుడి తొలి పూజకు భక్తులంతా సన్నద్ధమయ్యారు. కూకట్‌పల్లిలో వినాయక చవితి ఉత్సవాల సందడి మొదలైంది. కూకట్‌పల్లి, మూసాపేట, కేపీహెచ్‌బీ కాలనీ, ఆల్విన్ కాలనీ, వివేకానందనగర్, ఫతేనగర్, బాలానగర్, ఓల్డుబోయినపల్లి, అల్లాపూర్, గాయత్రినగర్, పర్వతనగర్, వివేకానందనగర్ లక్ష్మీనగర్, రాజీవ్‌గాంధీనగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో వాడవాడలా మండపాలను సిద్ధం చేశారు. ఇప్పటికే వినాయక విగ్రహాలను తెచ్చుకొని బుధవారం ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి అందంగా అలంకరించారు. అల్లాపూర్ డివిజన్‌లో బ్యాండ్ బాజాలతో ఆగమన్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూ టూ హైటెక్‌సిటీ రోడ్డులోని రైతుబజార్, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపుల్లో వినాయక ప్రతిమలు, పూజా వస్తువులు, పండ్లు, పూలు, పత్రి, తదితర సామగ్రి దుకాణాలు కిటకిటలాడాయి. ప్రజలు కొనుగోలు చేసేందుకు రావడంతో రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి.


అరిటాకులను కొనుక్కొని వెళ్తున్న మహిళ

మట్టి గణపతుల పంపిణీ..

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఆయా డివిజన్లలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు మంగళవారం మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ జలకన్య హోటల్ వద్ద సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఆరెకపూడి గాంధీలు వేర్వేరుగా హాజరై మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. అలాగే, మూసాపేటలోని మోతినగర్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, అల్లాపూర్‌లో కార్పొరేటర్ సబీహా బేగం, బాలాజీనగర్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు, సర్దార్‌పటేల్‌నగర్, వసంతనగర్, ఆరోఫేజ్ పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ కేపీహెచ్‌బీ డివిజన్ సీనియర్ నాయకుడు సాయిబాబు చౌదరి, బాలానగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


వినాయక మండపాన్ని అలంకరిస్తున్న నిర్వాహకులు


వినాయక విగ్రహాన్ని బైకుపై తీసుకెళ్తున్న వ్యక్తి



వివేకానందనగర్‌లో మట్టి గణపతుల ప్రతిమలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సబీహా బేగం


కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు సాయిబాబుచౌదరి


బాలాజీనగర్‌లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శిరీష బాబురావు


తులసీనగర్‌లో ఘనంగా ఆగమన్ ర్యాలీ


ఫతేనగర్‌లో 13 అడుగుల వినాయక విగ్రహం


వినాయకుడి పూజ కోసం సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు


కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న శేఖర్‌రెడ్డి తదితరులు


బాలానగర్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

'మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో ప్రభుత్వం విఫలం'

హైదర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి విమర్శించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి డివిజన్‌కు 1000 నుంచి 2వేల వరకు మట్టి విగ్రహాలను అందజేశామని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేవలం 200 విగ్రహాలకే పరిమితమైందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే కాలంలో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని కార్పొరేటర్ రోజాదేవి అన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

హైదర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల నిర్వాహకులు పోలీసులు, అధికారుల సూచనలు పాటించాలని కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు అన్నారు. ప్రగతినగర్ రోడ్డు అంబీర్‌చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పోలీసులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొలను వద్ద నిమజ్జన ఏర్పాట్లు, వసతులపై జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్ అధికారులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరిగేలా నిరంతరం అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే రహదారుల్లో గుంతలను పూడ్చాలని సంబంధిత అధికారులను కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాజశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ రాజీవ్, ఎలక్ట్రికల్ డీఈ స్వప్న, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



100 పడకల ఆస్పత్రి పనులు ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆస్పత్రి నిర్మాణ పనులను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని, వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆటల్లోనూ రాణించాలి

- కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

హైదర్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆల్విన్ కాలనీ డివిజన్ ఎన్టీఆర్‌నగర్ బేతల్ గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ గోపి చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. పిల్లలకు ఉచితంగా ట్యూషన్ చేప్పడం, భోజనం పెట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మహేష్, ఖలీమ్, కటిక రవి, పాషా, ప్రసాద్, యోగి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణంరాజు

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణంరాజు

భెల్‌కాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ పరిశ్రమ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్మికుల సంక్షేమమే బీహెచ్ఈఎల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన ధ్యేయమని కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్‌డీవీ కృష్ణంరాజు పేర్కొన్నారు. భెల్ టౌన్‌షిప్‌లోని అధికార కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం కృష్ణంరాజు మాట్లాడుతూ.. కార్మిక సంఘంలోని కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కార్మిక సంక్షేమాన్ని విస్మరించి రెండేళ్లుగా ఒంటెద్దు పోకడలను అవలంబించారని, అంతర్గత విభేదాల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్మిక సంఘాన్ని బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వినోద్, మేనేజింగ్ కమిటీ సభ్యులు సతీష్, దేవ్లానాయక్, సజీవ్‌ప్రసాద్, సతీష్‌బాబు, రవి, మహేశ్వర్‌బాబు, యాదిరెడ్డి, రాజ్‌కుమార్, ఖాన్, రాజ్‌కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


బాడీబిల్డర్ శ్రీకాంత్‌ను సన్మానించి పూలబొకే అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు


ఫంక్షన్‌హాల్ నిర్వహణపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఫంక్షన్ హాల్ నిర్వహణ ఇలాగేనా..?

- అధికారులపై ఎమ్మెల్యే కృష్ణారావు ఆగ్రహం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు శుభకార్యాలు జరుపుకునే ఫంక్షన్ హాల్ నిర్వహణ ఇలాగేనా అంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించారు. ఫంక్షన్‌హాల్ చెత్తాచెదారంతో నిండి ఉండడం, ఆవరణలో మద్యం సీసాలు కన్పించడం, పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలిపి ఉండడం, కిటికీల అద్దాలు ధ్వంసం కావడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలు వెచ్చించి పేదలకు ఉపయోగపడేలా ఫంక్షన్ హాల్ నిర్మిస్తే నిర్వహణ చేయలేక ఇలా వదిలేస్తారా అని అధికారులను ప్రశ్నించారు. నెల రోజులు సమయం ఇస్తున్నాను. మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. లేదంటే జీహెచ్‌ఎంసీ మూసాపేట కార్యాలయంలో పనులు జరగకుండా అడ్డుకుంటానని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు. ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అరిగోస పెడుతుందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మూసాపేట్ సర్కిల్ ఇంజనీరింగ్ ఈఈ రమేష్, డీఈఈ శంకర్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డర్ శ్రీకాంత్‌కు అభినందన..

కూకట్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కృష్ణారావు సూచించారు. మోతీనగర్‌కు చెందిన శ్రీకాంత్ బాడీబిల్డింగ్ పోటీలలో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీకాంత్‌ను ఆయన అభినందించి సత్కరించారు.

రోలర్ స్కేటింగ్ చాంపియన్‌కు సన్మానం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలో జరిగిన ప్రతిష్ఠాత్మక 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఒక స్వర్ణం, రెండు రజత పతకాలు సాధించి భారతదేశానికి కీర్తి తీసుకువచ్చిన అంతర్జాతీయ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటర్ పడిగ తేజేస్‌ను హోలిస్టిక్ ఆసుపత్రుల యాజమాన్యం మంగళవారం సత్కరించింది. ఈ కార్యక్రమానికి హాజరైన హోలిస్టిక్ ఆసుపత్రుల ఛైర్మన్, చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ వీఎస్. రామచంద్ర, మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఆప్తమాలజిస్టు డాక్టర్ తుశారా ఆలూరి పతకాలు సాధించిన తేజేస్‌ను అభినందించారు. తేజస్ విజయాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. అతను ఒలింపిక్స్‌లో భారత్‌కు బంగారు పతకం తీసుకొస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. తేజేస్ తండ్రి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



తేజస్‌ను సన్మానిస్తున్న ఆస్పత్రి ప్రతినిధులు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్

బాలానగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ తెలిపారు. ప్రశాంత్‌నగర్ రూ.2 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 16 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ప్రశాంత్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, శ్రీశ్రీనగర్ కాలనీల్లో విద్యుత్ సమస్యలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో బోయినపల్లి డీఈ గోపాల్‌రావు, ఏడీఈ రంగారెడ్డి సతీష్‌బాబు, ఏఈలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి: ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కాంట్రాక్టర్లకు సూచించారు. మియాపూర్ డివిజన్ గాయత్రీ ఎన్‌క్లేవ్ నుంచి బొల్లారం మెయిన్‌రోడ్డు వరకు రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న వరద నీటి కాలువ పనులను స్థానిక కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. డీజీఎం శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫుడ్‌కోర్టులో అగ్నిప్రమాదం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలోని చైతన్య ఫుడ్ కోర్టులో అగ్నిప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో కిచెన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అందులో పనిచేసే సిబ్బందితో పాటు చుట్టు పక్కల నివాసితులు భయాందోళనకు గురయ్యారు. సమీపంలోనే వాణిజ్య కేటగిరికి ఉపయోగించే సిలిండర్లు పదికి పైగా ఉన్నాయి. ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. నిర్వాహకులు గోప్యంగా ఉంచినా స్థానికులు పలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో చైతన్య ఫుడ్‌కోర్టులో జరిగిన ప్రమాదం వెలుగులోకి వచ్చింది. దీనిపై చైతన్య ఫుడ్ కోర్టు నిర్వాహకుడు రామకృష్ణను ఆంధ్రజ్యోతి సంప్రదించగా సిలిండర్‌కు, స్టవ్‌కు మధ్యలో ఉండే పైపుకు మంటలు అంటుకున్నాయి. వెంటనే ఆర్పడంతో ఎటువంటి నష్టం జరగలేదని ఆయన చెప్పారు.

బైకును ఢీకొన్న లారీ

- ద్విచక్ర వాహనదారుడు మృతి


రోహిత్ (ఫైల్)

బాలానగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బైకు, లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి బాలానగర్‌లోని ఐడీపీఎల్ గోశాల వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ న్యూబోయగూడకు చెందిన రోహిత్(26), నితిన్ వరుసకు ఇద్దరు అన్నదమ్ములు. నిజాంపేటలోని బంధువుల ఇంట్లో గృహ ప్రవేశానికి వచ్చి రాత్రి తిరుగు పయనమయ్యారు. బాలానగర్ ఐడీపీఎల్ గోశాల వద్దకు రాగానే లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకు నడుపుతున్న రోహిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైకు వెనుక కూర్చున్న నితిన్‌కు గాయాలు కావడంతో అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. రోహిత్ సోదరుడు దీపక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలానగర్ సీఐ నర్సింహరాజు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలానగర్‌లో వాహనాల వేలం

బాలానగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ 6 వాహనాలను మంగళవారం బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేశారు. ఇందులో 2 స్క్రాప్ ద్విచక్రవాహనాలు, 1 కారు, 3 ద్విచక్రవాహనాలు ఉన్నాయి. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాధవయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ వేలంలో కేవలం స్క్రాప్ ద్విచక్రవాహనాలు మాత్రమే విక్రయించబడ్డాయి. కారు, ఇతర వాహనాల ఖరీదు ఎక్కువగా ఉండడంతో వాటిని ఎవరూ కొనుగోలు చేయలేదు. కార్యక్రమంలో బాలానగర్ ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ యాదయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవారత్న అవార్డులు ప్రదానం

చందానగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందని హెచ్‌సీయూ తెలుగు ఆచార్యులు వెంకటేశ్వర్లు అన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి ఆధ్వర్యంలో మంగళవారం మాదాపూర్ స్వాతి స్కూల్ ఆవరణలో మదర్ థెరిసా జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు చేసిన ఐదుగురికి అవార్డులు అందజేశారు. అసోసియేషన్ సభ్యులు విష్ణుప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086


అంబీర్‌చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

హైదర్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ రోడ్డు అంబీర్‌చెరువు వద్ద గణపతి విగ్రహాల నిజ్జన కొలనును మంగళవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొలను వద్ద నిమజ్జన ఏర్పాట్లు, వసతులపై జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్ అధికారులతో మాట్లాడారు. ప్రజలు నిబంధనల ప్రకారం అధికారుల సూచనలు పాటించాలని ఆయన కోరారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిమజ్జనం కోసం వాహనాలు వచ్చే రహదారుల్లో గుంతలను పూడ్చాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరిగేలా నిరంతరం అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ మాధవరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎలక్ట్రికల్ డీఈ స్వప్న, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణంరాజు

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

● కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణంరాజు

భెల్‌కాలనీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్మికుల సంక్షేమమే బీహెచ్‌ఈఎల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన ధ్యేయమని కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్‌డీవీ కృష్ణంరాజు పేర్కొన్నారు. భెల్ టౌన్‌షిప్‌లోని అధికార కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం కృష్ణంరాజు మాట్లాడుతూ.. కార్మిక సంఘంలోని కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కార్మిక సంక్షేమాన్ని విస్మరించి రెండేళ్లుగా ఒంటెద్దు పోకడలను అవలంబించారని, అంతర్గత విభేదాల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్మిక సంఘాన్ని బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వినోద్, మేనేజింగ్ కమిటీ సభ్యులు సతీష్, దేవ్లానాయక్, సజీవ్‌ప్రసాద్, సతీష్‌బాబు, రవి, మహేశ్వర్‌బాబు, యాదిరెడ్డి, రాజ్‌కుమార్, ఖాన్, రాజ్‌కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు గ్రహీతలతో అచార్యులు వెంకటేశ్వర్లు, అసోసియేషన్ సభ్యులు

సేవారత్న అవార్డులు ప్రదానం

చందానగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తమ రంగాల్లో అంకితభావంతో పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందని, అలాంటి వారికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవారత్న అవార్డులు అందజేసి ప్రోత్సహిస్తుందని హెచ్‌సీయూ తెలుగు అచార్యులు దార్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మాదాపూర్ స్వాతి స్కూల్ ఆవరణలో మదర్ థెరిసా జయంతి సందర్భంగా సేవారత్న అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి దార్ల వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై వివిధ రంగాల్లో సేవలు చేసిన ఐదుగురుకి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఫణికుమార్, అసోసియేషన్ సభ్యులు విష్ణుప్రసాద్, పాలం శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యాయులు భసవలింగం, రామన్న తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేత

హైదర్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ బేతల్ గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలో స్వతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ గోపి చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. పిల్లలకు ఉచితంగా ట్యూషన్ చేప్పడం, భోజనం పెట్టడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, ఖలీమ్, కటిక రవి, పాషా, ప్రసాద్, యోగి తదితరులు పాల్గొన్నారు.


గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి


ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లో గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ


ఆల్విన్‌కాలనీ డివిజన్ జలకన్య సెంటర్‌లో గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం

పర్యావరణహితంగా పండుగ చేసుకుందాం

● ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
● భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

గచ్చిబౌలి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతో ముడిపడి ఉన్న మట్టిగణపతులను పూజించాలని, పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి భక్తులకు పిలుపునిచ్చారు. మంగళవారం మసీద్‌బండలోని శేరిలింగంపల్లి బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు మట్టి గణపతి విగ్రహాలను నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామన్నారు.

కార్పొరేటర్ రాగం ఆధ్వర్యంలో..

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపీనగర్, రాజీవ్ గృహకల్పలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ప్రజలకు మట్టి గణనాథుడి విగ్రహాలను పంపిణీ చేశారు. గణపతి నవరాత్రుల సందర్భంగా పర్యావరణానికి హాని కలుగకుండా పండుగను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

డీసీ ప్రశాంతి ఆధ్వర్యంలో..

వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని శేరిలింగంపల్లి ఉపకమిషనర్ ప్రశాంతి ప్రజలకు సూచించారు. మంగళవారం మాదాపూర్ శిల్పారామం వద్ద మట్టిగణపతులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కొండాపూర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి డివిజన్లలో ఒక్కో డివిజన్‌లో 8వేల మట్టి గణపతులను పంపిణీ చేశామన్నారు. మల్కం చెరువు, నల్లగండ్ల చెరువు, మాదాపూర్ శిల్పారామం వద్ద, కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వద్ద ఔట్‌లెట్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి, పారిశుధ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


గోపీనగర్‌లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

రాజీవ్ గృహకల్పలో..

మియాపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి రాజీవ్‌గృహకల్పలో వార్డు మెంబర్ శ్రీకళ ఆధ్వర్యంలో మంగళవారం జీహెచ్‌ఎంసీ తరఫున మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బద్దం కొండల్‌రెడ్డి స్థానికులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

హైదర్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఫేజ్-2లోని జలకన్య హోటల్ వద్ద సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంగులతో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మల్లేష్, మహేష్, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, రాంచందర్, ఖలీమ్, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.


విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీసీ ప్రశాంతి


విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో..

భెల్‌కాలనీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణహితంగా ఉండే మట్టి వినాయక విగ్రహాలకు పూజలు చేయాలని భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్ కార్యాలయంలో మంగళవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మట్టి వినాయకులను పూజించడం ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయమన్నారు. రసాయనాలు అద్దిన విగ్రహాలను నిమజ్జనం చేస్తే అవి నీటిలో కరగవని, ఎన్నో అనర్థాలకు దారితీస్తాయని చెప్పారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కాంట్రాక్టర్లకు సూచించారు. మియాపూర్ డివిజన్ పరిధిలో గాయత్రీ ఎన్‌క్లేవ్ నుంచి బొల్లారం మెయిన్‌రోడ్డు వరకు రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న వరద నీటి కాలువ పనులను స్థానిక కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం శరత్‌రెడ్డి, మేనేజర్ సునీత, ఇంజనీరింగ్ ఏఈ సంతోష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

హైదర్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్ కాలనీ వాసులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్‌లోని కార్యాలయంలో మంగళవారం కలిశారు. కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కాలనీలో గుంతల రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, త్వరలోనే ఆదిత్యనగర్‌లో పర్యటించి సమస్యలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, ఆదిత్యనగర్ అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం, మొయిజ్, రిజ్వాన్, ఫజల్, డాక్టర్ నరేష్, వెంకటేష్, అహ్మద్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విగ్రహాల పంపిణీలో ప్రభుత్వం విఫలం

● కార్పొరేటర్ రోజాదేవి



హైదర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతీ డివిజన్‌కు 1000 నుంచి 2000 వరకు మట్టి విగ్రహాలను అందజేశారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేవలం 200 విగ్రహాలకే పరిమితమైందన్నారు. ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.


కంటి పరీక్షలు చేయించుకున్న విద్యార్థులతో వైద్య సిబ్బంది

విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు

చందానగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చందానగర్ సరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, వాసన్ ఐ కేర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 6 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వైద్యులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, పాఠశాల పాలకమండలి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం లేకే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ

● మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నగరం నలుమూలల నుంచి ఐటీ కారిడార్‌కు వచ్చే వాహనాలతో ట్రాఫిక్ గణనీయంగా పెరుగుతోందని, మెజారిటీ వాహనదారులంతా ప్రధాన రహదారుల పైనే రాకపోకలు సాగిస్తుండడంతోనే నిత్యం ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయని మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఐటీ కారిడార్‌లో తీవ్ర రూపం దాల్చిన ట్రాఫిక్ జామ్‌లపై ఆయన ప్రత్యేకంగా స్పందించారు. ప్రజా రవాణా సదుపాయాలు అవసరాలకు అనగుణంగా లేకపోవడంతో చాలామంది సొంత వాహనాల్లోనే ఐటీ కారిడార్‌కు వచ్చి వెళ్తున్నారని, ఐటీ కారిడార్‌లో ఉన్న వేలాది కంపెనీలకు నిత్యం లక్షలాది మంది ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువ మంది సొంత కార్లలోనే రాకపోకలు సాగిస్తున్నారని, ట్రాఫిక్ రద్దీ పెరిగినప్పుడు ప్రత్యామ్నాయ రహదారులు లేకపోవడంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్ సమస్యలు తీవ్రమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఈ మార్గాల్లోనే అధికంగా ట్రాఫిక్ రద్దీ..

ఐటీ కారిడార్ వైపు వచ్చే కొన్ని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. అందులో మొదటిది కేపీహెచ్‌బీ నుంచి సైబర్ టవర్స్ వైపు వచ్చే మార్గంలో ప్రతిరోజూ కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని ఆయన వివరించారు. అదేవిధంగా మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి వచ్చే మార్గం, జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్కు నుంచి దుర్గం చెరువు మీదుగా, చెక్‌పోస్టు నుంచి మాదాపూర్ మీదుగా సైబర్ టవర్స్, మియాపూర్ ఆల్విన్‌కాలనీ జంక్షన్ నుంచి హఫీజ్‌పేట మీదుగా కొండాపూర్ వచ్చే మార్గం, నార్సింగి వైపు నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా గచ్చిబౌలి, రాయదుర్గం వైపు ఉన్న ప్రధాన రహదారులపైనే ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోందని ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. ఈ ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలంటే, ఆ మార్గంలో ప్రత్యామ్నాయ రోడ్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఈ విషయమై సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జీహెచ్‌ఎంసీ, టీజీఐఐసీ అధికారులతో సంప్రదింపులు జరిపారని చెప్పారు. పరిష్కార మార్గాల కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న ప్రధాన మార్గాల్లో ప్రతి రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్లపై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న తమ సిబ్బంది సూచనలు పరిగణలోకి తీసుకుంటూ తాత్కాలిక చర్యలుగా ట్రాఫిక్ డైవర్షన్‌లు చేస్తున్నట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ కూన దుర్గా ఆనంద్ తండ్రి కూన సత్యనారాయణ, ఫ్లాట్ నం.401, వాసవి ఆర్కేడ్, ప్రగతినగర్ చర్చి రోడ్డు, నిజాంపేట్ వారు తెలంగాణ, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్ మండలం, నిజాంపేట్ గ్రామం మరియు గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నం.184/భాగంలోని ఫ్లాట్ నంబర్లు 38 & 39 కలిగిన 545 చ.గజాల మొత్తంలో 27.5 చ.గజాల విస్తీర్ణ అవిభాజ్య వాటా భూమితో పాటు "వశిష్ఠ అపార్ట్‌మెంట్స్"లోని 1065 చ.అ. విస్తీర్ణ మూడవ అంతస్తులోని ఫ్లాట్ నం.302 (కామన్ ఏరియాలు సహా) ఆస్తికి ఏకైక మరియు సంపూర్ణ యజమాని. సదరు కూన దుర్గా ఆనంద్ తండ్రి కూన సత్యనారాయణ, ఫ్లాట్ నం.401, వాసవి ఆర్కేడ్, ప్రగతినగర్ చర్చి రోడ్డు, నిజాంపేట్ వారు తన సొంత పనులు ముగించుకుని, 01 అక్టోబర్ 2024న ఎస్సార్వో కుత్బుల్లాపూర్ నుండి బాచుపల్లి నుండి తన ఇంటికి టూవీలర్‌పై ప్రయాణించే సమయంలో, మియాపూర్ రోడ్డుకు చేరుకున్నప్పుడు, అతను పైన పేర్కొన్న ఆస్తికి సంబంధించిన సేల్ డీడ్ నం: 14784/2008 కలిగిన ఒక ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినదని గమనించారు. కావున, పైన పేర్కొన్న డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినా లేదా ఆస్తిపై ఏవేని క్లెయిములు లేదా అభ్యంతరములు ఉన్నా, ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 7 (ఏడు) రోజులలోగా దిగువ సంతకందారుకు అందజేయగలరని/ సంప్రదించగలరని ఇందుమూలముగా సాధారణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

సం/- ఎల్.వి. రామకృష్ణ, ఎస్. వెంకటేశ్వర్లు, న్యాయవాదులు, శ్రీకృష్ణ లా అసోసియేట్స్, నం.12-5-37, గూడ్‌షెడ్ రోడ్డు, మూసాపేట, హైదరాబాద్. మొబైల్: 6300195600 9885127694, 9390855564

రోలర్ స్కేటింగ్ చాంపియన్‌కు సన్మానం


తేజస్‌ను సన్మానిస్తున్న ఆస్పత్రి ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలో జరిగిన ప్రతిష్ఠాత్మక 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఒక స్వర్ణం, రెండు రజత పతకాలు సాధించి భారతదేశానికి కీర్తి తీసుకువచ్చిన అంతర్జాతీయ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటర్ పడిగ తేజ్‌ను హోలిస్టిక్ ఆసుపత్రుల యాజమాన్యం మంగళవారం సత్కరించింది. ఈ కార్యక్రమానికి హాజరైన హోలిస్టిక్ ఆసుపత్రుల చైర్మన్, చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ వీఎస్. రామచంద్ర, మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ అప్తమాలజిస్టు డాక్టర్ తుశారా ఆలూరి పతకాలు సాధించిన తేజేస్‌ను అభినందించారు. తేజస్ విజయాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. అతను ఒలింపిక్స్‌లో భారత్‌కు బంగారు పతకం తీసుకొస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తేజేస్ తండ్రి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


పూలు విక్రయిస్తున్న వ్యాపారులు


వర్షంలోనే పత్రి అమ్ముతున్న వ్యాపారులు

మార్కెట్లో వినాయక చవితి సందడి

రాయదుర్గం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లో వినాయకచవితి సందడి నెలకొంది. నేడు పండుగ నేపథ్యంలో మంగళవారం వినాయక విగ్రహాలు, పూజ సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు రోడ్లపై పెద్ద సంఖ్యలో కనిపించారు. మరోవైపు పర్యావరణ పరిరక్షణపై నగర ప్రజల్లో అవగాహన పెరగడంతో గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం మట్టి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో చాలాచోట్ల జీహెచ్‌ఎంసీ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సైతం మట్టి గణపతులను తయారుచేసి మార్కెట్‌లో అమ్మకాలకు ఉంచుతున్నారు. గణపతి పూజలో వినియోగించే 21 రకాల మొక్కల ఆకులను సైతం పెద్ద ఎత్తున అమ్మకాలకు ఉంచారు. అయితే మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లపై విక్రయించేందుకు తెచ్చిన అరటాకులు, వినాయకుడి పూజలో ఉపయోగించే పలు రకాల ఆకులు తడిసిపోయాయి. దీంతో భక్తులు, వ్యాపారులు కొంత ఇబ్బంది పడ్డారు.

పూజకు వినియోగించే పత్రి..

అర్జునపత్రం, తులసి, మాచిపత్రం, చుతపత్రం, గండకీపత్రం, శమిపత్రం, బృహతిపత్రం, ఉత్తరేణి సహా పలు రకాల పత్రాలను అమ్మకాలకు ఉంచారు. చందానగర్, అయ్యప్పసొసైటీ, మియాపూర్ ప్రాంతాల్లో వీటిని ఎక్కువగా అమ్ముతున్నారు.

ఆకాశాన్నంటిన పూల ధరలు..

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పూల ధరలకు రెక్కలొచ్చాయి. కిలో బంతి రూ.400, చామంతి రూ.450, గులాబీ రూ.600లకు పైగా రేట్లు పలకడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. పండుగ సీజన్‌లో ధరలను ఇష్టానుసారంగా పెంచడం సరికాదని పలువురు వాపోయారు.





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086


షాపూర్‌నగర్ రైతుబజార్ వద్ద గణపతి పూజాపత్రి అమ్మకాలు


జగద్గిరిగుట్టలో పూలు కొంటున్న మహిళలు


షాపూర్‌నగర్‌లో పూలు, తమలపాకుల షాపుల వద్ద రద్దీ


సుచిత్రలోని కొబ్బరికాయల దుకాణం వద్ద ..

మార్కెట్లకు వినాయక చవితి కళ

పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిట


మామిడాకులు కొనుగోలు చేసిన మహిళ

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం , ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వినాయక చవితి నేపథ్యంలో మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మార్కెట్లు, చౌరస్తాలు పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వివిధ కాలనీలు, బస్తీల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన జనం వినాయక విగ్రహాలు, పూలు, పండ్లు, పత్రిని కొనుగోలు చేశారు. గతేడాది కంటే ఈసారి గణపతి విగ్రహాల ధరలు అధికంగా ఉన్నాయి. రూ.200 నుంచి రూ. 50 వేల వరకు విగ్రహాల రేట్లు ఉన్నాయి.


జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్‌లో మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జగన్


ప్రగతినగర్ పరిధిలోని మిథిలానగర్‌లో... కాలనీ అసోసియేషన్ సభ్యుడు సురేష్ తదితరులు

మట్టి గణపతే మహాగణపతి

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేసిన రంగుల విగ్రహాల కన్నా.. పర్యావరణ హితమైన మట్టితో చేసిన విగ్రహాలనే గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో పూజించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మట్టివిగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు.



రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌గౌడ్



కొంపల్లి మున్సిపాలిటీలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో.. ప్రత్యేకాధికారి చంద్రమోహన్, కమిషనర్ కృష్ణారెడ్డి


బాచుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కుల, ఆదాయ సర్టిఫికెట్లను సత్వరం జారీ చేయండి

- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

నిజాంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులను, వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కుల, ఆదాయ, స్థానికత సర్టిఫికెట్లను పెండింగ్‌లో లేకుండా సత్వరం జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కార్యాలయ సిబ్బందితో పాటు శిక్షణ పొందిన సర్వేయర్లు ఎలా పనిచేస్తున్నారని తెలుసుకున్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాశ్, తహసీల్దార్ పూల్‌సింగ్, ఆర్‌ఐలు రేణుక, భానుచందర్, సర్వేయర్లు సంధ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వారాంతపు సంతను మార్చండి: బీజేపీ

షాపూర్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సూరారం మెయిన్‌రోడ్డు నుంచి లక్ష్మీనగర్ వైపు వెళ్లే రహదారిలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న వారాంతపు సంతతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క గుంతలమయంగా మారిన రోడ్డు,మరోపక్క సంత కారణంగా వాహనదారులు గంటల కొద్దీ సమయంలో ట్రాఫిక్‌లోనే గడపాల్సి వస్తోంది. వాహనదారుల సమస్యను గుర్తించిన అధికారులు ఈ రోడ్డులో నిర్వహిస్తున్న సంతను పక్కరోడ్డులోకి మార్చాలని బీజేపీ నాయకులు అంగడి మల్లేష్, దేవర రమేష్ ఆధ్వర్యంలో గాజులరామారం సర్కిల్ డీసీ మల్లారెడ్డి, సూరారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ట్రాఫిక్‌ను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బాలరాజు, సుధాకర్, శ్రమశక్తి అవార్డు గ్రహీత కె.సుభాష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బాలానగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బైకు, లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. బాలానగర్ పోలీసుల కథనం ప్రకారం.. న్యూబోయగూడకు చెందిన రోహిత్(26), నితిన్ వరుసకు అన్నదమ్ములు. నిజాంపేటలోని బంధువుల ఇంట్లో గృహప్రవేశానికి వచ్చి సోమవారం అర్ధరాత్రి తిరిగి వెళ్తుండగా, బాలానగర్ ఐడీపీఎల్ గోశాల వద్దకు రాగానే.. వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకు నడుపుతున్న రోహిత్ అక్కడికక్కడే మృతి చెందగా, బైకు వెనుక కూర్చున్న నితిన్‌కు గాయాలు కావడంతో అంబులెన్స్‌లో గాంధీకి తరలించారు. రోహిత్ సోదరుడు దీపక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ నర్సింహరాజు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాజులరామారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు

గాజులరామారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు జీడిమెట్ల పోలీసులు చర్య తీసుకుంటున్నారు. గాజులరామారం చౌరస్తాలో ప్రధాన రోడ్డుపై ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం ప్రమాదాలకు నిలయంగా ఉన్న ఈ చౌరస్తాలో గత నాలుగు నెలల నుంచి రోడ్ల విస్తరణ, రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుద్ స్తంభాల తొలగింపు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సిగ్నల్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఈఎస్‌ఐ చౌరస్తాలో కూడా రోడ్డు మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేస్తామని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.


సూరారం కట్టమైసమ్మ వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన కొలనును మంగళవారం పరిశీలించిన మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, సీఐ సుధీర్‌కృష్ణ, టాఫిక్ సీఐ శ్రీనివాస్ తదితరులు

పేదలపై ఆస్తి పన్ను భారం తగ్గించాలి

- ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్,ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలపై అధికంగా ఆస్తిపన్నులు వేసి ఆర్థిక భారం మోపొద్దని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డిలను ఆయన మంగళవారం కలిశారు. జంట సర్కిళ్ల పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్. బస్తీల్లో 60 గజాల ఇళ్లకు మూడేళ్ల ఆస్తి పన్నుపై పెనాల్టీలను రద్దు చేయాలని ఆయన కోరారు. కాలనీల్లో చాలా కాలం క్రితమే ఇళ్లు నిర్మించుకున్నారని, ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న వారు ఎక్కువగా పేదలు ఉన్నారని, వారికి అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ప్రజల సమస్యలను పరిగణలోకి తీసుకుని ఆస్తిపన్నుపై వేస్తున్న అపరాధ రుసుంను మాఫీ చేయాలని కోరారు. ఈ సమస్యపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు ఫోన్ చేసి వివరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కార్పొరేటర్ కొలుకుల జగన్, విజయ్‌శేఖర్‌గౌడ్, మంత్రి సత్యనారాయణ, నాయకులు మహ్మద్‌రఫీ, మన్నెరాజు, పుప్పాల భాస్కర్, గుబ్బల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.





ఫంక్షన్ హాల్ నిర్వహణ ఇలాగేనా..?

- అధికారులపై ఎమ్మెల్యే కృష్ణారావు ఆగ్రహం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు శుభకార్యాలు జరుపుకునే ఫంక్షన్ హాల్ నిర్వహణ ఇలాగేనా అంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఆయన కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించారు. ఫంక్షన్‌హాల్ చెత్తాచెదారంతో నిండి ఉండడం, ఆవరణలో మద్యం సీసాలు కన్పించడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలు వెచ్చించి పేదలకు ఉపయోగపడేలా ఫంక్షన్ హాల్ నిర్మిస్తే నిర్వహణ చేయలేక ఇలా వదిలేస్తారా అని అధికారులను ప్రశ్నించారు. 'నెల రోజులు సమయం ఇస్తున్నాను. మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. లేదంటే జీహెచ్‌ఎంసీ మూసాపేట కార్యాలయంలో పనులు జరగకుండా అడ్డుకుంటాన'ని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేకాట కేంద్రంపై పోలీసులు దాడిచేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి 72 వేల 780 రూపాయాలు, రెండు సెట్ల ప్లేయింగ్ కార్డ్‌లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. పేట్‌బషీర్‌బాద్ పోలీసుల కథనం ప్రకారం.. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని ఓ ఇంట్లో పేకాటాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు సోమవారం రాత్రి సదరు ఇంటిపై దాడిచేశారు. పేకాటాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గంలో కుత్బుల్లాపూర్‌కు పెద్దపీట


ఉమామహేష్ ఏసురత్నం స్వామి

జీడిమెట్ల,ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి); సీపీఐ నూతన రాష్ట్ర కార్యవర్గంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ముగ్గురు నాయకులను ఎన్నుకున్నారు. ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు గాజులరామారంలో నిర్వహించిన 4వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఎన్నుకున్న నూతన కమిటీలో కార్యవర్గ సభ్యుడిగా ఉమామహేష్, రాష్ట్ర సమితి ఆహ్వాన సభ్యులుగా కె.ఏసురత్నం, కె.స్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం తమ వంతు కృషి చేస్తామని, పార్టీ తమపై పెట్టిన బాధ్యతలను నెరవేరిచి పేదలకు న్యాయం చేసేందుకు పోరాడుతామన్నారు.




కాలనీల్లోని విద్యుత్ సమస్యలను తెలుసుకొంటున్న అధికారులు

విద్యుత్ సమస్యలపై బస్తీబాట

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారులు కొంపల్లి మున్సిపాల్టీ పరిధిలో విద్యుత్ సమస్యలపై స్థానికులతో కలిసి మంగళవారం బస్తీబాట నిర్వహించారు. సెంట్రల్‌పార్కు, జయభేరి పార్కు, కొంపల్లి గ్రామంలో డీఈ పోతరాజు, ఏడీఈ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్ పర్యటించి ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ సంబంధిత సమస్యలను అడిగితెలుసుకొన్నారు. సెంట్రల్ పార్కులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని స్థానికులు అధికారులను కోరారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం స్వాధీనం


మహిళ మృతదేహం

దుండిగల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహాన్ని దుండిగల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 45 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ మహిళ మృతదేహం సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో చర్చిగాగిల్లాపూర్ సర్వే నెంబర్ 225 వద్ద గల వరి పొలం పక్కనే ఉన్న షెడ్‌లో పడి ఉండగా స్థానికులు గమనించి దుండిగల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి ఎత్తు 5 అడుగుల 4 అంగుళాలు ఉంది. చామనఛాయ రంగు ఉంది. కాళ్లపై రెండు చెట్టు బొమ్మల పచ్చబొట్లు ఉన్నాయి. మృతురాలిని ఎవరైనా గుర్తిస్తే 8712568303 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.













ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
పున్నారావు: 9985921366